డా॥ జి.అరుణకుమారి తి.తి.దే., తిరుపతి

2008

# అన్నమయ్య సంకీర్తనలు – దశావతార వర్ణన

క్రీ.శ. 1424 – క్రీ.శ. 1503 అన్నమాచార్యుల జీవిత కాలంగా చరిత్ర చెబుతుంది. అన్నమాచార్యుడు నందవర వైదిక బ్రాహ్మణ వంశస్థుడు. భారద్వాజ గోత్రుడు. ఇతని తల్లిదండ్రులు నారాయణ సూరి, లక్కమాంబ. అన్నమయ్య తాత నారాయణయ్యకు త్రికాల వేదియైన చింతలమ్మ ప్రత్యక్షమై తాళ్ళపాకలో వెలసియున్న చెన్నకేశవస్వామి అనుగ్రహం వలన సకల విద్యలు పొందగలడని, 'మూడవ తరంబునను వదలని కీర్తి మీ వంశంబునందు పరమభాగవతుడు ప్రభవించు శౌరివశమున' (అన్నమయ్య చరిత్ర, పుట–7) అని అనుగ్రహించింది. లక్కమాంబ ధర్మపత్ని మాడుపూరు మాధవ స్వామి భక్తురాలు 'స్వామి తోడునీడై ఆమెతో మాటలాడు'. (అన్నమయ్య చరిత్ర, పుట–8)

స్వామి హస్తమందలి నందకమనే నిజ ఖడ్గాంశలో పేయాళ్వారు, అన్నమయ్య అవతరించారని ప్రాజ్ఞుల విశ్వాసం. తాళ్ళపాక సాహిత్యంలోను, శాసనాల్లోను అన్నయ్యను అన్నమయ్యంగారు, అన్నమాచార్యులు, అన్నమ గురు, అన్నమార్య, కోనేటి అన్నమయ్యంగారు అని నామాంతరాలున్నాయి. అన్నమయ్య సుమారు 79 సం॥ జీవించాడు.

1. యోగ సంకీర్తనలు, శృంగార సంకీర్తనలు, వైరాగ్య సంకీర్తనలు 32 వేలు. వీటిలో 12 వేలు శృంగార అధ్యాత్మ సంకీర్తనలు లభ్యం.
2. ద్విపద రామాయణం – పూర్తిగా లభించలేదు.
3. వేంకటాద్రి మహాత్మ్యం – అలభ్యం (సంస్కృతం) దీనిని గురించి చిన్నన్న (అన్నమయ్య జీవిత చరిత్ర) పేర్కొనలేదు.
4. శృంగార మంజరి ద్విపద – లభ్యం 517 పంక్తులు గలది.
5. 12 శతకాలు – వీటిలో వేంకటేశ్వర శతకం లభ్యం.

అన్నమాచార్యుల సంకీర్తనలు 32 సంపుటాలుగా వెలువడ్డాయి. ఇవి ఇతని రచనలుగా గుర్తింపబడినవి. (చిన్నన్న, అన్నమయ్య జీవిత చరిత్రము)

తాళ్ళపాక వారి కాలంలో సంకీర్తనాన్ని పదమని వ్యవహరించారు. కీర్తించునది కీర్తనం. సమ్యక్ కీర్తనం సంకీర్తనం. అవాఙ్మనస గోచరమైన దివ్యశక్తిని కీర్తించి పాడునది కీర్తనం లేక సంకీర్తనం. ఇది భక్తుని హృదయాన్ని పరమాత్ముని సన్నిధికి కొనిపోతుంది. పదగతౌ – పాదసన్నిధికి తీసుకొనిపోయేది. సంగీత సాహిత్యాల సమ్మేళనమే సంకీర్తనం. భావనాద ప్రధానమైనది పల్లవి చరణాలలో కూడినది సంకీర్తనం.

సాహిత్యపు కూర్పు వాక్కుగా, సంగీతపు కూర్పు గేయంగా గలవారు వాగ్గేయకారులు. మాటను – మాతువు (భావ ప్రధానం) సప్తస్వరముల కేర్పడిన సంజ్ఞగల ధాతువు (నాద ప్రధానం). ధాతుమాతువులను ఉభయ సంజ్ఞలతో కూడిన రచన చేయగలవాడు వాగ్గేయకారుడు, బయకారుడు.

వస్తు భేదాన్ననుసరించి సంకీర్తన పదరచనలు రెండుగా విభజింపబడ్డాయి. అవి శిష్ట రచనలు, దేశి రచనలు. వ్యవహారంలో ఉన్న గేయరచనారీతి ననుసరించి ఏలలు, జాజరల, వెన్నెల, చందమామ పదాలు, లాలి, ఉయ్యాల, డోల మొదలైనవి.

భావ భేదాన్ని అనుసరించి శృంగార కీర్తనలు, అధ్యాత్మిక సంకీర్తనలని, అవస్థా భేదాన్ని అనుసరించి శృంగార సంకీర్తనలు, విప్రలంభ శృంగారం, సంయోగ శృంగారమని, అవస్థా భేదాన్ని అనుసరించి అధ్యాత్మ సంకీర్తనలు తాత్వికాలు, లౌకికాలు (రాజకీయాలు, సాంఘికాలు, సమకాలిక పరిస్థితులు, వ్యక్తిగత విషయాలు, ఆచార వ్యవహారాలు, నీతి నియమాలు).

తాత్వికాలలో ముఖ్యభక్తి, గౌణభక్తి అని రెండు రకాలు. శరణాగతి, ప్రపత్తి, నామసంకీర్తనం, స్వామివారి అనంత కళ్యాణ గుణాలు, అవతారాలు, అంశలు, ఆలయోత్సవాలు, సేవలు, పండుగలు పబ్బాలు, కీర్తించిన వేలుపులు – ఏకాదశాధిక భక్తి భేదాలు.

**సంకీర్తన పదరచనలు**

- **శిష్ట రచనలు**
  - **శృంగార రచనలు**
    - **విప్రలంభ**
    - **సంయోగ**
  - **అధ్యాత్మ రచనలు**
    - **తాత్వికాలు**
      - **శరణాగతి**
      - **ప్రపత్తి**
      - **నామ సంకీర్తనం**
      - **అవతారాలు**
      - **అంశలు**
      - **కీర్తించిన వేలుపులు**
      - **ఆనంద కల్యాణ గుణాలు**
      - **ఆలయోత్సవాలు**
      - **సేవలు**
      - **పండుగలు, పబ్బాలు**
    - **లౌకికాలు**
      - **రాజకీయాలు**
      - **సాంఘికాలు**
      - **సమకాలిక పరిస్థితులు**
      - **వ్యక్తిగత వ్యవహారాలు**
      - **నీతి నియమాలు**
- **దేశి రచనలు**
  - **ఏలలు**
  - **జాజరలు**
  - **వెన్నెల**
  - **చందమామ**
  - **లాలి**
  - **ఉయ్యాల**
  - **డోల**

వైష్ణవ పరిభాషలో న్యాసమనగా భక్తుడు తన ఆత్మను పరిపూర్ణంగా పరమాత్మాధీనం చేయడం. దీనికే ప్రపత్తి, శరణాగతి అనే పర్యాయ పదాలున్నాయి. 'శ్రవణం కీర్తనం విష్ణోః మననం పాదసేవనం అర్చనం వందనం దాస్యం సఖ్యం ఆత్మనివేదనం' అనేవి నవవిధ భక్తులని భాగవతం వివరిస్తుంది. మనస్సు ప్రేమార్ద్రమై తైలధార రూపంలో నిష్కామంగా భగవంతుని వైపుకు ప్రవహించటం ఉత్తమమని నారద పంచరాత్రం మనస్సుకు ప్రాధాన్యం ఇచ్చింది. భక్తి అంటే భయం అని నిఘంటువు అంటుంది.

నిరంతర ప్రేమ ప్రవాహమే భక్తి అని రామానుజాచార్యులు, ప్రేమకు స్నేహ ఛాయను మధ్వాచార్యులు, భక్తి అంటే ఉపాసన కాదు ప్రేమ అని సర్వేపల్లి, భక్తి అంటే ప్రేమ సారమని వివేకానందుడు, 'భక్తి పరేశాను భవః భగవంతుని అనుభవించుటే భక్తి అని శుకమహర్షి, భగవత్కథలను వినుటే భక్తి అని గార్గమహర్షి పేర్కొన్నారు.

పద కవితలన్నీ సాధారణంగా భగవంతుని మీద భక్తితో స్తోత్ర రూపంగా కనిపిస్తాయి. కాని ఈ సంకీర్తన తాత్త్వికంగా సామాజిక స్పృహతో ఉండటం విశేషం.

అన్నమాచార్యులు సామంతరాగం ఎలా పాడారో తెలియదు. క్షేత్రజ్ఞుల కాలంలో రూపుదిద్దుకొన్న రాగాలు వాటి వాటి స్వరూపాలు పోగొట్టుకోకుండా దినదినం నూతన రచనాలంకారలను రూపుదిద్దుకున్నాయి. సింధూర తిలక, ఖండా, గౌరిపంతు, సామంతం, మారవ మొదలైన కొన్ని రాగాలు అక్కడక్కడ ఉండిలేనట్లున్నాయి. త్యాగరాజు సృష్టించి పాడిన రాగాలు నేడు మనకు వాడుకలో ఉన్నాయి. అన్నమయ్యకు శిష్యులులేరు కాబట్టి సంకీర్తనలు ఏ రాగంలో పాడారో తెలియదు. వివరణ లేకున్నా అర్థమయ్యేలా, వివరణ లేకుండా ఏ మాత్రం అర్థం కానివి ఎన్నో కీర్తనలు ఉన్నాయి. తాళ్ళపాక అన్నమయ్య వాఙ్మయం అర్థభావ ప్రధానమైనది.

**అన్నమయ్య దశావతారాల వర్ణన :**

**సామంతం రాగం:-**

పll తానే కాకెవ్వరు మాకు - దాతయు దైవము తన
లోన బెట్టుకొని మాకు - లోనైన వాడు ll

చll చదవించి, కూడు వెట్టి, జారకుండ నిల్లుగట్టి
బెదురు లేని బుద్ధి పిన్ననాడే చెప్పి
యెదిరి నడిగి, ద్రవ్యమిది గొమ్మనుచు నిచ్చి
పదిలమై తమ్ము బాలించు వాడు llతానేll

చll మోహ వియోగమ్ము - మోహానురాగమ్ము
దేహ విభాగంబు - దెలిపిన కలికి
ఐహికమున వేంకటాధీశుడై సర్వ
దేహ రక్షకుడై తిరుగుచున్నాడు llతానేll

సమస్త జీవులకు ప్రాణదాత దైవం అయిన పరమాత్మ అఖిలాండ కోట్లను తనలో పెట్టుకున్నా భక్తులకు వశమైనవాడు.

1. మత్స్యావతారుడై వేదాలను వెదికి తెచ్చాడు. (చదవించాడు)
2. కూర్మావతారుడై అమృతం, కామధేనువు, ఔషధాలు, లక్ష్మి, ఆహార పానీయాలను (కూడువెట్టు) సమకూర్చాడు.
3. వరాహావతారుడై ఎక్కడో జారిపోయిన భూమిని పైకి తీసి తన వాడి కోరలనే గోడలతో (జారకుండ) ఇల్లు కట్టాడు.
4. నరసింహావతారుడై (బెదురు లేని బుద్ధి చిన్ననాడే చెప్పి) ఐదేళ్ళ పసివాడికి తండ్రినే ఎదురించే ధైర్యమిచ్చాడు.
5. వామనరూపుడై (యెదిరినడిగి) శత్రువైన బలిచక్రవర్తిని దానం అడిగాడు.

6. పరశురాముడై క్షత్రియులను సంహరించి బ్రాహ్మణులకు (ద్రవ్యమిది గొమ్మనుచు) భూదానం చేసాడు.
7. రామావతారుడై మాయలేడిపై మోహం చెందిన భార్య (మోహ) వియోగాన్ని అనుభవించాడు.
8. శ్రీకృష్ణుడై సమస్త జీవరాశిని తన మురళీగానంతో (మోహానురాగ) పరవశులను చేసాడు.
9. జీవ పరిణామ క్రమాన్ని తెలిపి జీవాత్మను పరమాత్మకు చేరువ చేయాలని (దేహ విభాగంబు దెలిపిన) కల్కి అవతారం దాల్చాడు.
10. వేంకటాధీశుడైన పరమాత్ముడు సర్వప్రాణులలో (దేహ రక్షకుడై) ఉన్నాడు. అవతార వర్ణనలో బలరామ అవతారాన్ని పేర్కొనకపోవటం గమనించవలసిన అంశం.

మరొక నిందాస్తుతి కీర్తనలో కర్మ ఫలితాన్ని సూచించాడు అన్నమయ్య.

**సాళంగనాట :**

| | | |
|---|---|---|
| ప॥ | ఎట్టి వారికి నెల్ల నిట్టి కర్మములు మా | |
| | యెట్టి వారికి నింక నేది తోవయ్య ॥ | |
| చ॥ | పాము చంపిన యట్టి పాతకమున బెద్ద | (కాళీయుని) |
| | పాము మీద నీకు పవళించ వలసివచ్చె | (శేష శయన) |
| | కోమలి జంపిన కొరత వల్ల నొక్క | (పూతన / తాటకి) |
| | కోమలి నెద బెట్టుకొని యుండ వలసె ॥ | (లక్ష్మీదేవి) |
| చ॥ | బండి విరచినట్టి పాతకమున బెద్ద | (శకటాసురుని) |
| | బండి బోయిడవై పని సేయ వలసె | (శ్రీకృష్ణుడు) |
| | కొండ వెరికినట్టి – గుణమున తిరుమల | (గోవర్ధనగిరి) |
| | కొండ మీద నీకు – గూచుండ వలసె ॥ | (తిరుమల) |

జగద్రక్షకుడవైన నీకే కర్మ తప్పనప్పుడు మానవ జన్మలెంత?

1. కాళీయుని చంపడంవలన ఎప్పుడూ పాము మీదనే శయనించవలసిన కర్మ పట్టిందట.
2. పూతన రాక్షసిని / తాటకిని సంహరించడం వలన ఒక స్త్రీని (శ్రీలక్ష్మి) జీవితాంతం ఎదమీద కూర్చుండ బెట్టుకునే కర్మ కలిగిందట.
3. శకటాసురుని (బండి రూపంలో) వధించుటం వలన కురుక్షేత్ర సంగ్రామంలో రథసారధి అయ్యాడట.
4. గోవర్ధన పర్వతాన్ని పెరికినందువలన తిరుమల కొండపై శాశ్వతంగా ఉండవలసి వచ్చిందట.

**సామంతం రాగం:–**

| | | |
|---|---|---|
| ప॥ | ఇందరికి నభయంబు లిచ్చు చేయి | |
| | కందువగు మంచి బంగారు చేయి ॥ | |
| చ॥ | వెలలేని వేదములు – వెదకి తెచ్చిన చేయి | (మత్స్యావతారం) |
| | చిలుకు గుబ్బలి క్రింద – జేర్చు చేయి | (కూర్మావతారం) |
| | కలికియగు భూకాంత – గౌగిలించిన చేయి | (వరాహావతారం) |
| | వలనైన కొనగోళ్ళ – వాడి చేయి | (నరసింహావతారం) |

| | | |
|---|---|---|
| చ॥ | తనివోక బలిచేత - దానమడిగిన చేయి | (వామనావతారం) |
| | ఒనరగ భూదాన - మొసగు చేయి | (పరశురామావతారం) |
| | మొనసి జలనిధి యమ్ము మొనకు దెచ్చిన చేయి | (రామావతారం) |
| | యెనయ నాగేలు ధరియించు చేయి | (బలరామావతారం) |
| చ॥ | పురసతుల మానములు పొల్లసేసిన చేయి | (శ్రీకృష్ణావతారం) |
| | తురగంబు బరపేటి దొడ్డ చేయి | (కల్కి అవతారం) |
| | తిరువేంకటాచలాధీశుడై మోక్షంబు | |
| | తెరువు ప్రాణులకెల్ల దెలిపె నీ చెయి ॥ | (2-319) |

నిర్గుణ తత్వాన్ని అంగీకరించినా సగుణమే జీవునికి అందగల తత్వంగా భావించి సామాన్య భక్తులకు కూడా భావావేశాన్ని అందుకొని ఆనందించి మాధుర్యాన్ని పొందే విధంగా సంకీర్తనలను రూపొందించాడు అన్నమయ్య.

**హస్తవర్ణనా నైపుణ్యంతో దశావతార వర్ణన :**

1. శ్రుతులను దొంగిలించి సముద్రంలో దాగిన సోమకుని సంహరించి అమూల్యమైన వేదాలను వెదకి తెచ్చిన చేయి.
2. క్షీరసాగరమథనంలో మందరాద్రిని నిలబెట్టటానికి దానిక్రింద చేర్చిన చేయి.
3. హిరణ్యాక్షుడు భూమిని పాతాళానికి తోసినపుడు ఆ అసురుడిని సంహరించి భూదేవిని కౌగలించిన చేయి.
4. ప్రహ్లాదుని మాట దక్కించటానికి స్తంభంలో ఆవిర్భవించిన హిరణ్యకశిపుని చీల్చిన వాడి గోళ్ళుగల చేయి.
5. దేవతలనందరినీ ఉద్ధరించే సర్వేశ్వరుని హస్తంగా కలిగిఉండి తనివిపొందక బలిని దానమడిగిన చేయి.
6. 21 మార్లు రణరంగంలో క్షత్రినులను దనిమి స్వాధీనపరచుకున్న భూమినంతటిని కశ్యపునికి దానమిచ్చిన చేయి.
7. రావణుని పరిమార్చటానికి కపిసేనతో కదిలిపోయినపుడు మార్గమధ్యంలో అడ్డుతగిలిన సముద్రాన్ని బాణాగ్రంతో వశం చేసుకున్న చేయి.
8. నాగేలును ఆయుధంగా ధరించిన చేయి.
9. త్రిపురాసుర వనితల పాతివ్రత్య అభిమానాలను చెరచిన చేయి.
10. దుష్ట సంహారానికై నలుదెసల గుర్రాన్ని బరపిన చేయి.

**ముగింపు :**

అవతారాలను దర్శించిన తీరులో అన్నమయ్య ప్రదర్శించిన విజ్ఞతలో నవ్యత కనిపిస్తుంది. తాత్విక దృక్పథంలోను, కాల దర్శనంలోను విలక్షణత కనిపిస్తుంది.

'ఒక్కనాటి ప్రపంచము ఒక్కనాటి వలె రాదు
ఒక్క నిముషము వలె నొకటి గాదు
ఒద్దనే కాలము నుండు ఉండుండీ దవ్వయి పోవు'.

'ముగియదు కాలము ముందరికింకా
దిగని ప్రవాహము దిస దిస మిదిగో'

ప్రతిరోజు కొత్త సూర్యుణ్ణి చూస్తున్నాను. ప్రతిదినం ప్రవహించే నదిలో ప్రవేశం నిత్యనూతనం అని చెప్పిన గ్రీకు తాత్వికుడు హిరాక్లిటస్ మాటలు ఈ సందర్భంలో గుర్తుకొస్తాయి.

క్రీ.శ. 15వ శతాబ్దంలో పదకవిత కొత్త పుంతలు తొక్కింది. 'నామ సంకీర్తనం యస్య సర్వపాప ప్రణాశనమ్' (భాగవతం 12-13-23) సర్వపాపాలను కడిగి వేయగల భగవన్నామ పరమార్థాన్ని పదసాహిత్యంలో వెలయించిన ధన్యజీవి తాళ్ళపాక అన్నమాచార్యులు.

అందమైన రామనుజాచార్య మతమును
అందుకొని నిలిచినాడన్నమయ్య
విందువలె మాకును శ్రీ వేంకటనాథుని నిచ్చె
అందరిలో తాళ్ళపాక అన్నమయ్య (16.సం. 1భా 23 సంకీర్తనం)

వైష్ణవమతాన్ని పునరుద్ధరింప జేసిన చరితార్థుడు అన్నమయ్య. ఆత్మార్పణం చేసుకున్న భక్తుని తనువు గుడిగా, తల శిఖరంగా, హృదయం పీఠంగా, చూపులు ఘనదీపాలుగా, పలుకు మంత్రంగా, నాలుక గంటగా మారుతుంది. ఇటువంటి పరమార్థ పదసాహిత్యాన్ని అందించిన అన్నమయ్య తెలుగు సాహిత్యంలో పదకవితా పితామహుడుగా నిలిచాడు.